# ప్రజలెవరు ఆందోళన చెందవద్దు..!

- చెక్ పోస్టుల వద్ద అటవీ శాఖ వేధింపులు ఉండవు
- నేటి నుంచి ఆంక్షలు ఎత్తివేత
- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్
- రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కంజర్వేటర్ రాకేశ్ డోబ్రియాల్‌ను కలిసిన సమస్యను వివరించిన వెడ్మ బొజ్జు



8


# ప్రభాత సమాచారం

https: epaper. prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ శనివారం | 8 ఫిబ్రవరి 2025 | ■ 8 పేజీలు





6

# ఎమ్మెల్సీ ఎన్నికల వేడి

- జోరుగా టీచర్స్ నియోజకవర్గ అభ్యర్థుల ప్రచారం
- తమ సంఘ నేతలను గెలిపించుకునే ప్రయత్నం
- ఆయా పార్టీల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు
- ఎన్నికల వేళ దావత్ షురూ..!
- ఉపాధ్యాయులకు ప్రలోభాలు మొదలు
- జిల్లా సంఘాల బాధ్యులకు బాధ్యతల అప్పగింత
- ఒక్కరోజే భారీగా నామినేషన్‌లు దాఖలు..
- గ్రాడ్యుయేట్స్ 28, టీచర్స్‌కు 2, మొత్తం 30
- నేడు, రేపు సెలవు దినాలు ■ ఇక మిగిలింది ఒక్కరోజే

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రధాన ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎన్నికల వేడిని పెంచుతున్నారు. ప్రధాన ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థులు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల టీచర్ కాన్స్టెన్సీ అభ్యర్థుల తరపున జిల్లాల్లో ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆయా ఉపాధ్యాయ సంఘాల కీలక బాధ్యులు ప్రచార బాధ్యతను తీసుకొని తమ సంఘ నేతలను గెలిపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఒక వైపు ఓటర్లను ఆకర్శిస్తూనే మరో వైపు ఆయా పార్టీల మద్దతు కూడగట్టేందుకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి నలుగురు అభ్యర్థుల మధ్య బలమైన పోటీ ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో శాసనమండలి ఎన్నికల దావత్‌లు కూడా మొదలయ్యాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మీటింగ్‌లు ఏర్పాటు చేసి పెద్దమొత్తంలో మందు, మాంసంతో విందు దావత్‌లు ఇస్తూ ఉపాధ్యాయులకు ప్రలోభాల ఎర వేస్తున్నట్టు చర్చ నడుస్తోంది.



8

## రాష్ట్ర పండుగగా కుమ్రం భీం వర్ధంతి

- సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కుమ్రంభీం మనువడు సోనేరావు
- కుమ్రంభీం మనువడు కుమ్రం సోనేరావును సన్మానించిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

గోండు వీరుడు కుమ్రం భీం వర్ధంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కుమ్రం భీం మనువడు సోనేరావుతో కలిసి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృత్ఞతలు తెలిపి సన్మానించారు. భీం పోరాటానికి అండగా నిలబడి పోరు సల్పిన జోడేఘాట్ పరిధిలోని 12 గ్రామాల ప్రజల సమస్యలు, పరిష్కరించాలని, రోడ్లు, ఇండ్లు మంజూరు చేయాలనీ ముఖ్యమంత్రిని కోరారు.



వివరాలు 8లో

## క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సాహం

- కబడ్డీ సంఘం అంతర్జాతీయ డైరెక్టర్ జగదీష్ యాదవ్ ■ కబడ్డీ చాంపియన్ సూర్యపేట
- త్వరలో తెలుగు కబడ్డీ లీగ్ ■ రెండో స్థానంలో నల్గొండ జట్టు ■ హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్

## పోరు కన్నా ఊరు మిన్న

3లో

- మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలి
- కుమ్రంభీం ఎస్పీ శ్రీనివాసరావు, నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల
- లొంగిపోతే ఇంటికి భద్రంగా పంపిస్తాం



## రెచ్చిపోయిన దొంగలు

- పార్కు చేసిన బైక్ నుంచి రూ. 4.40 లక్షలు చోరీ
- బైక్‌పై ఉడాయించిన యువకులు
- అన్న కూతరు వివాహం కోసం డబ్బులు డ్రా
- పక్కా ప్రణాళికతో చోరీకి పాల్పడ్డ యువకులు
- సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్న పోలీసులు-4

## వందశాతం ఇంటిపన్ను వసూలు చేయాలి

- తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి
- నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి అధికారులు ముందస్తు ప్రణాళికలు తయారు చేయాలి
- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

గ్రామ పంచాయతీల్లో వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, పన్ను వసూలు, వన మహోత్సవం, తదితర అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు.

వివరాలు 8లో



# ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో అగ్ని ప్రమాదాల నివారణ

**జన్నారం, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
అడవుల్లో అగ్ని ప్రమాదాలను ముందస్తుగా గుర్తించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగపడుతుందని పర్యావరణ వేత్తలు అన్నారు. అడవులలో అగ్ని ప్రమాదాల నివారణకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఏఐ వినియోగం, దానిపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం జన్నారం మండల కేంద్రంలోని ఫారెస్ట్ టిడిసి సెంటర్‌లో అటవీశాఖ అధికారులకు సిబ్బందికి అవగాహన కల్పించారు. అభయారణ్యంలోని అటవీ ప్రాంతాలలో ఏఐ ఉపయోగించి ముందుగానే అగ్ని ప్రమాదాలను గుర్తించి అరికట్టవచ్చని వివరించారు. అగ్ని ప్రమాదాలతో అడవులే కాకుండా వన్యప్రాణులు సైతం చనిపోయే ప్రమాదముందన్నారు. వేసవి సమీపిస్తున్న తరుణంలో అడవులలో జరిగే అగ్ని ప్రమాదాలు నివారించుకో వడానికి, అలాగే అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడానికి ఈ శిక్షణ అటవీశాఖ అధికారులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీపీటీ శాంతారామ్, డిఎఫ్ఓ శివ అసిస్ సింగ్, తలపేట ఎఫ్ఆర్ఓ సుష్మారావు, ఇందన్‌పల్లి ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్, శిక్షకులు బెంగళూరు వైల్డ్ లైఫ్ స్టడీ సెంటర్ అధికారి నరేంద్రన్ కోదండపాణి ఎఫ్ఎస్ఓలు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలి

### బీజేపీ జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
నియోజకవర్గానికి మంజూరవుతున్న నిధులు, అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రకటనలు మానుకో వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10 కోట్లు విడుదల కాగా ఆ నిధులు ఎమ్మెల్సీ కృషి వల్లే విడుదల అయ్యాయని కాంగ్రెస్ నాయకులు ప్రకటించుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ నిధుల మంజూరు కోసం గత డిసెంబర్ నెలలోనే ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు బాబు ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీకి ప్రతిపాదనలు పంపారని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని, ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.


## వ్యాస రచన పోటీల్లో ఎస్సై ప్రతిభ



**నిర్మల్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అక్టోబరు 21న పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో నిర్మల్ జిల్లా నుండి పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచిన ఎస్ఐ జ్యోతిని జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించారు. అంతేకాకుండా బహుమతిగా 15 వేల రూపాయల నగదును అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావడం సంతోషకరమన్నారు.

## నులి పురుగులపై అవగాహన

**నిర్మల్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ రూరల్ మండలంలోని చిట్యాల ఉన్నత పాఠశాలలో నులి పురుగుల వల్ల వచ్చే వ్యాధులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముజ్గి ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ షగుప్త పాల్గొని ప్రసంగించారు. పిల్లల్లో నులి పురుగులుంటే రక్తహీనత, బలహీనత, ఆకలి మందగించడం, వికారం, అతిసార లాంటి వ్యాధులు వస్తాయని ఆమె తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుంటే ఈ వ్యాధి పిల్లల దరిచేరదన్నారు. 10న అన్ని పాఠశాలల్లో మాత్రలు అందుబాటులో ఉంచుతామన్నారు. గైర్హాజరైన విద్యార్థులు సైతం 17న తప్పకుండా మాత్రలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్వైజర్ సునీత, నర్సయ్య, వహీద్, సంతోష్, అనూష పాల్గొన్నారు.




## లైబ్రరీని సందర్శించిన విద్యార్థులు




**ఆదిలాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అన్స్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం జిల్లా గ్రంథాలయంను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ, వివిధ భాషలకు చెందిన పుస్తకాలను, జీవిత చరిత్రలు, స్వీయ చరిత్రలు, దేశ నాయకుల చరిత్రల పుస్తకాలను చూపించారు. పుస్తకాలు చదివితే జ్ఞానం వస్తుందని, ప్రతినిత్యం పుస్తకాలు చదువుతు ఉండలని కళాశాల ప్రిన్సిపల్ అతిక్ బేగం అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, రేఖ, నరేష్, ఇంగ్లీష్ విభాగం అధ్యాపకులు, అనిత, సంతోషిని, హిందీ విభాగం అధ్యాపకులు పూనం, జిల్లా గ్రంథాలయ అధికారులు సతీష్, కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధీరవనిత కండెల మల్లక్క



**బెజ్జూర్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
మండలంలోని ఆదివాసీ భవనంలో ఆదివాసీ ముద్దుబిడ్డ కండెల మల్లక్కకు ఆదివాసి సంఘాల నాయకులు ఆమె చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం బక్కయ్య మాట్లాడుతూ ఆదివాసీల అభ్యున్నతి కోసం మల్లక్క ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. భూస్వాములను ఎదురించి నిరుపేదలకు భూమిని పంపిణీ చేశారన్నారు. కార్యక్రమంలో మండల సర్ మెడి శంకర్, గౌరవ అధ్యక్షుడు సక్కరం, మండల ఆదివాసీ అధ్యక్షురాలు అమృత, సలహా దారులు ఏనుక శంకర్, లక్ష్మీ, వెంకటేష్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ అభ్యర్థిని గెలిపించండి

**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
ఉమ్మడి కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా శుక్రవారం అంజిరెడ్డి నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు హరీష్ బాబు, కాటిపల్లి వెంకటరమణ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుకైనా బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కరీంనగర్ మాజీ మేయర్ సునీల్ రావు, సీనియర్ భాజపా నాయకులు బాస సత్యనారాయణ, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు గంగిడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### గ్రామాల్లో కొనసాగుతున్న

## క్రాప్ డిజిటల్ సర్వే



**జన్నారం, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలం పలు గ్రామాల శివారులలో క్రాప్ డిజిటల్ సర్వే కొనసాగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జన్నారం మండలంలోని రాంపూర్ తిమ్మాపూర్ సింగరాయపేట తపాలాపూర్ గ్రామ శివారులో రైతుల పొలాల్లో వేసిన పంటలను గుర్తింపునకు సింగరాయపేట క్లస్టర్ ఏఈఓ సాయి శుక్రవారం డిజిటల్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు రైతుల పొలాలకు వెల్లి అక్కడ వేసిన పంటలను ఫొటో తీసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పంటల నమోదు ప్రక్రియ డిజిటల్ సర్వే రూపంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

## శ్రీశైలంను సన్మానించిన ఎమ్మెల్యే



**కాగజ్‌నగర్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
కుమ్రంభీం ఆసిఫాబాద్ బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీశైలంను శుక్రవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాను న్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

## సెల్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్

**ముథోల్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గురువారం రాత్రి ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కాడు. సుమారు నాలుగు గంటలకు పైగా తన ఆస్తి తనకు కావాలని హంగామా చేశాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని యువకుడిని కిందికి దించేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. స్థానిక యువకులు, ఎస్ఐ గణేష్ సము దాయించి నరేష్‌ను కిందికి దింపి పోలీస్ స్టేషన్‌కు తీసు కెళ్లారు. మద్యం మత్తులో సెల్ టవర్ ఎక్కిన సముదాయించి కిందకి దింపి ప్రాణం కాపాడిన పోలీసులు, యువకుల తీరును గ్రామస్తులు అభినందించారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించండి



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఏడీగా పదోన్నతిపై వచ్చిన ఎస్.వేణుగోపాల్ గౌడ్‌ను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలని పరిష్కరించాలని బీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అదే విధంగా అన్ని రకాల పాఠశాలలలో చదువుతున్నటువంటి బీసీ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు నర్సా గౌడ్, అధికార ప్రతినిధి కాసర్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు మేకల అశోక్, సత్యనారాయణ, సెక్టోరియల్ అధికారి జెట్టి నారాయణ, డీఈఓ కార్యాలయ సి.సి రాజేశ్వర్, జూనియర్ అసిస్టెంట్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.




# వందశాతం ఇంటిపన్ను వసూలు పూర్తి చేయాలి

## వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి - నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
గ్రామ పంచాయతీల్లో వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఇంటి పన్ను వసూలు, వన మహోత్సవం, తదితర అంశాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పంచాయతీలో ఇంటి పన్ను వసూలును త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న వేసవికాలంలో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. పంచాయితీ కార్యదర్శులు గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, చేతి పంపులు, బోరు బావుల పనితీరును పర్యవేక్షించి, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. తీవ్రమైన నీటి ఒత్తిడి గల మండలాలను గుర్తించి ఆయా మండలాల్లోని గ్రామాలలో నీటి సమస్యను అధిగమించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి పన్ను వసూలు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు గ్రామాల్లో వసూలు చేసిన ఇంటి పన్ను వసూలు వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు వసూలు చేసిన పన్నులకు చలానాలు కట్టి, సంబంధిత ఖాతాల్లో జమ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అన్ని రకాల వ్యాపారస్తుల వాణిజ్య లైసెన్సులను వందశాతం పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభోత్సవం నాటికి గ్రామాల్లోని నర్సరీలో పెంచుతున్న మొక్కలను సిద్ధం చేయాలన్నారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శిస్తూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో తనిఖీ చేసి నివేదికలను పంపాలన్నారు. గ్రామాల్లో నిరంతరం మెరుగైన పారిశుద్ధ్యాన్ని కొనసాగించాలన్నారు. ముఖ్యంగా రానున్న వేసవి కాలం దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. మండలస్థాయి అధికారులకు గ్రామీణ స్థాయి అధికారులపై నియంత్రణ కలిగి ఉండాలన్నారు. అధికారులు, సిబ్బంది తమ విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ గోవింద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిపిఓ శ్రీనివాస్, ఎంపీడీఓలు, ఎంపిఓలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రమాబాయి జయంతిలో పాల్గొన్న సుగుణ




**ఆదిలాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
ఆదిలాబాద్ పట్టణంలోని అశోకబుద్ధ విహారంలో రమాబాయి అంబేద్కర్ 128వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణ హజరై రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాతా రామాబాయి అంబేద్కర్ త్యాగాల తల్లి అని కొనియాడారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు
# వినియోగించుకోవాలి
## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఈ నెల 27వ తేదీన జిల్లాలో జరుగనున్న పోలింగ్లో రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ సంస్థలు, వ్యాపారం, పరిశ్రమలు, ట్రేడ్ ఇతర సంస్థలలో పని చేస్తున్న అర్హత గల ఓటర్లు తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీన పోలింగ్ జరుగుతుందని, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజు సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని, ప్రైవేట్ సంస్థలలో పని చేసే ఉద్యోగులు, అధికారులకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు విధుల్లో వెసలుబాటు కల్పించడం జరుగుతుందని, సెలవు ఇవ్వడం జరుగుతుందని, ఆయా సంస్థల యాజమాన్యాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సహకరించాలన్నారు.



# వరుసగా రెండు రోజులు స్కూళ్లకు సెలవులు

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
వరుసగా రెండు రోజుల పాటు స్కూళ్లకు సెలవులు రానున్నాయి. ఇప్పటికే విద్యార్థులకు జనవరిలో భారీగా సెలవులు వచ్చాయి. నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలకు సెలవులు దొరకడంతో విద్యార్థులు సందడిగా గడిపారు. అయితే వార్షిక పరీక్షలు దగ్గర పడుతుండటంతో ప్రిపరేషన్‌తో బిజీ అయిపోయారు స్టూడెంట్స్. అయితే ఫిబ్రవరిలో మరో రెండు రోజుల పాటు సెలవులు రానున్నాయి. ఇప్పటికే నాలుగు ఆదివారాలు రాగా మరో రెండు రోజులు కూడా సెలవు దొరకనున్నాయి. 4 ఆదివారాలతో పాటు శివరాత్రి పండుగ కూడా ఈ నెలలోనే వచ్చింది. వీటికి తోడు అదనంగా మరో రోజు కూడా సెలవు దొరకనుంది. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఆయా స్థానాలకు నోటిఫికేషన్ వెలువడిన విషయం తెలిసిందే. ఇందుకు గానూ నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఫిబ్రవరి 27న గ్రాడ్యుయేట్‌తో పాటు టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ దృష్ట్యా పాఠశాలలకు సెలవు ఇవ్వనున్నారని తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్స్, స్కూల్ టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాగా, గతంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు ప్రభుత్వాలు సెలవు ప్రకటించిన విషయం విదితమే. దీంతో ఈ నెల 27న కూడా సెలవు మంజూరు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి 26న శివరాత్రి పండుగ రావడంతో ఆ రోజు పబ్లిక్ హాలీడే ఇస్తారు. దీంతో ఈ నెలలో ఆదివారాలతో పాటు మరో రెండు రోజుల సెలవులు కలిపి మొత్తం ఆరో రోజుల పాటు విద్యార్థులకు సెలవులు వచ్చినట్లు అవుతుంది.

# కోణార్క్ ఎన్‌బిఆర్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్ర చికిత్స



**నిర్మల్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
కొన్నాళ్లుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్న ఓ మహిళ కడుపులో ఉన్న తొమ్మిది కిలోల కంతిని గుర్తించి నిర్మల్ కోణార్క్ ఎన్.బి.ఆర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రాకేష్ విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారు. కడెం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన 45 ఏళ్ల లక్ష్మి అనే మహిళ కడుపు నొప్పితో నిర్మల్ కోణార్క్ ఎన్.బి.ఆర్ ఆసుపత్రిలో చేరింది. పరీక్షలు నిర్వ హించిన ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ రాకేష్ ఆమెకు పొత్తిక డుపులో కంతి ఉన్నట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులు సమ్మ తించడంతో డాక్టర్ రాకేష్ సుమారు 6 గంటలకు పైగా శ్రమించి ఈ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు సుమారు 9 కిలోలకు పైగా కంతిని బాధితురాలు లక్ష్మి పొత్తికడుపులో ఉంచి తొలగించారు. డాక్టర్ రాకేష్, డాక్టర్ శిరీష, ఆసుపత్రి సిబ్బంది మురళి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# 'పోరు కన్నా ఊరు మిన్న'

- మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలి
- లొంగిపోతే ఇంటికి భద్రంగా పంపిస్తాం
- అంకుభాయ్ అజ్ఞాతం వీడి జనంలోకి రావాలి..
- ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిస్తే ప్రభుత్వం తరపున అన్ని ప్రయోజనాలు అందేలా కృషి చేస్తాం
- కుమ్రంభీం ఎస్పీ శ్రీనివాసరావు



**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
అడవులను వీడి జనంలోకి రావాలని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మావోయిస్టులను కోరారు. శుక్రవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలంలోని అగర్‌గూడ గ్రామంలో 'పోరుకన్నా ఊరు మిన్న' కార్యక్రమంలో భాగంగా మావోయిస్టుల కుటుంబ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అగర్‌గూడా గ్రామానికి చెందిన మావోయిస్టు సభ్యురాలు చౌదరి అంకుబాయ్ అలియాస్ అనిత యొక్క కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా అంకు బాయ్ కుటుంబ సభ్యుల ప్రస్తుతస్థితిగతులతో పాటు వారి ఆరోగ్య పరిస్థితిపై ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు నిత్యావసర సరకులు, దుస్తులు పోలీసు అధికారులు అందజేశారు. ఏదైనా ఆరోగ్య సమస్య ఏర్పడితే వైద్య చికిత్సలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. వనం వీడి జనంలోకి వచ్చేలా చూడాలని, లొంగిపోతే ప్రభుత్వం నుండి అన్ని ఏర్పాట్లు చేస్తామని అజ్ఞాతం వీడి లొంగిపోతే ప్రభుత్వం నుండి అన్ని ఏర్పాట్లు చేస్తామని కుటుంబ సభ్యులకు తెలిపారు. మావోయిస్టు పార్టీలో పని చేసి సాధించింది శూన్యమని, ఇకనైనా అంకుభాయ్ అజ్ఞాతం వీడి జనంలోకి రావాలని కోరారు. ప్రస్తుత రోజుల్లో మావోయిస్టులకు ప్రజాదరణ తగ్గిందని, ఇవే కాకుండా అజ్ఞాత జీవితం గడుపుతున్న మావోయిస్టులు ఆరోగ్య సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరికొందరు మావోయిస్టు పోలీసుల ఎదురుకాల్పుల్లో చనిపోతున్నారని చెప్పారు. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిస్తే వారిపై ఉన్న రివార్డ్‌తో పాటు ప్రభుత్వం తరపున అన్ని ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలోని ప్రజలు, యువత చెడువ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాస్ రావు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రామానుజం. రూరల్ సీఐ శ్రీనివాసరావు. స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.





### పట్టగలే రెచ్చిపోయిన దొంగలు

# పార్కు చేసిన బైక్ నుంచి రూ. 4.40 లక్షలు చోరీ

**బైక్‌పై ఉడాయించిన యువకులు - అన్న కూతరు వివాహం కోసం బ్యాంకు నుంచి డబ్బులు డ్రా**

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద శుక్రవారం పార్కు చేసిన బైక్ నుంచి రూ. 4.40 లక్షలను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన దుర్గం వెంకటస్వామి అనే వ్యక్తి శుక్రవారం పట్టణంలోని ఎస్‌బీఐలో రూ. 4.40 లక్షలు విత్‌డ్రా చేశాడు. డబ్బులను తన ద్విచక్రవాహనం ట్యాంకు కవర్‌లో పెట్టుకుని కూరగాయలు కొనేందుకు కూరగాయల మార్కెట్ ఎదుట బైక్‌ను పార్క్ చేశాడు. ఈ సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు నెంబరు ప్లేటు లేని ద్విచక్రవాహనంపై వచ్చి పార్కింగ్ చేసిన బైక్‌లో నుంచి రూ. 4.40 లక్షలను ఎత్తుకెళ్లిపోయారు. వెంకటస్వామి కూరగాయలు కొనుక్కుని బైక్ వద్దకు వచ్చి ట్యాంకు కవర్‌లో డబ్బులు లేకపోవడంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు. కాగా తన అన్న కూతురు వివాహం మరికొద్ది రోజుల్లో ఉండడంతో బ్యాంకు నుంచి డబ్బులు విత్‌డ్రా చేసినట్లు బాధితుడు వెంకటస్వామి ఆవేదన వ్యక్తం చేశాడు.

**పక్కా ప్రణాళికతోనే..**

పార్కింగ్ చేసిన బైక్ ట్యాంకు కవర్ నుంచి రూ. 4.40 లక్షలు చోరీ చేసిన దుండగులు ముందస్తు ప్రణాళికతోనే చేసినట్లు నిర్ధారణ అయ్యింది. వెంకటస్వామి బ్యాంకు నుంచి డబ్బులు విత్‌డ్రా చేసినప్పటికీ నుంచి తన బైక్ వెనకాలనే దుండగులు క్యాప్ ధరించడంతో పాటు ముఖం కనిపించకుండా మాస్కులు ధరించి అనుసరించారు. చోరీకి అవకాశం కోసం చూస్తుండగా కూరగాయల మార్కెట్ వద్ద బైక్ పార్క్ చేయడంతో ఇదే అదునుగా భావించి బైక్ ట్యాంకు కవర్‌లో నుంచి డబ్బులు ఎత్తుకెళ్లిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. బ్యాంకు పరిసర ప్రాంతాల్లో, కూరగాయల మార్కెట్ చౌరస్తా వద్ద నంబరు ప్లేట్ లేని ద్విచక్రవాహనంపై డబ్బులను దొంగలించిన సీసీ కెమెరా పుటేజీలను పోలీసులు పరిశీలించారు. వెంకటస్వామి గమనించి కొంత దూరం వెంబడించినా ప్రయోజనం లేకపోయింది.

---

### విద్యాభివృద్ధికి రాష్ట్ర

# ప్రభుత్వం పెద్దపీట

### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుం దని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సంద ర్శించారు. విద్యార్థినీలతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం భోజనశాలను పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సంబంధిత అధికారులు నిర్మాణాలను పరిశీలించాలన్నారు. అనంతరం పోతనపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. నాణ్యమైన భోజనం అందిం చాలని సూచించారు. అనంతరం నర్సింగాపూ ర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. తాగునీరు, విద్యుత్, మూత్రశాలను, తరగతి గదులను ఆధునీకరించేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కనకలక్ష్మి, మహేష్ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**బోథ్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

బోథ్, సోనాల మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో అదిలాబాద్ నుండి వచ్చిన షీ టీం సిబ్బంది. షీ టీమ్ చేసే కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీం ఏఎస్ఐ సునీత మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలని 100, 1930 కాల్స్ మొదలైన విషయాల పట్ల విద్యార్థులకు అవగాహన కార్య క్రమాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సుశీల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రాథమిక దశలోనే చికిత్స తీసుకోవాలి




**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్**

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకావాలని, అప్పుడే ఎలాంటి అంగవై కల్యం కలగదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా మైనారిటీ బాలుర పాఠశాల లో స్పర్ లెప్రసీ అవేర్నెస్ క్యాంపెయిన్ ను నిర్వహించారు. ఇం దులో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంకోలి ఆధ్వ ర్యంలోను అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డి ఎం ఎం హెచ్ ఓ మాట్లాడుతూ మైకో బ్యాక్టీరియం లేపే అనే బ్యాక్టీరియా వల్ల కుష్టు వ్యాధి వస్తుందని అన్నారు. శరీరంపై పాలిపోయిన రాగి రంగు గల మొద్దు వారిన మచ్చలు, కాళు చేతుల్లో తిమ్మిర్లు రావడం కుష్టు వ్యాధికి సంబంధించిన లక్షణాలు అని తెలిపారు. ఈ వ్యాధికి అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆసుప త్రుల్లో ఎం డి టి చికిత్సను అందిస్తున్నామని తెలిపారు. అనంతరం కుష్టు వ్యాధి నివారణకు పాటుపడుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి వామన్ రావు, ఎం ఎల్‌హెచ్‌పి. అశ్విని, ఆరోగ్య పర్య వేక్షకులు సుభాష్, ఏఎన్ఎం తార, ప్రిన్సిపల్ వందన ఆశా కార్యకర్త పార్వతి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతపై కళాజాత

**ఇచ్చోడ, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్వో ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకులంలో విద్యార్థులకు ఆరోగ్యంపై కళాజాత నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు విద్య అవష్యా కత, ఆరోగ్యం వ్యక్తి గత పరిశుభ్రత గురించి పాటలు పాడి అవగాహనా పరిచారు. ఈ కార్యక్రమం లో టీమ్ లీడర్ చాకటి రవీందర్, వెంకట్ రావ్, మామిడిపెల్లి రాజలింగు, మెస్రం మురళి, రాటోద్ శంకర్, గోదం ఆశిష్, మాధురి, రాజా, శ్రీలత, దూర్పత బాయి, నాగోరావ్, ఎమ్ పి ప్రిన్సిపాల్ సంగీత, వైస్ ప్రిన్సిపాల్ నారాయణ, అధ్యాపాక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉద్యోగాలు పొందిన వారి సర్టిఫికెట్స్

# రీ వెరిఫికేషన్ చేయాలి

**ఉట్నూర్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

ఇటీవలే జరిగిన డీఎస్సీ టీచర్ ఉద్యోగ నియామకాలలో అవకతవకలు జరిగాయని, వెంటనే సర్టిఫి కెట్లను రీ వెరిఫికేషన్ చేయాలని ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిడాం జంగుదేవ్ పటేల్ డిమాండ్ చేశా రు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ డీఎస్సీ లో 35 మంది నకిలీ బోనాఫైడ్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్స్ తో హైదారాబాద్ లో ఉద్యోగాలు పొందిన వారిని తొలగించిన విషయం వారిని ఉద్యోగాల్లో నుండి తొలగించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో నకిలీ సర్టిఫికేట్లతో ఉద్యోగాలు పొందినట్లు తమకు తెలిసిందని, టీచర్ గా ఉద్యోగాలు పొందిన వారందరి సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకరికి నకిలీ బోనఫైడ్ ప్రైవేట్ పాఠశాల యాజ మాన్యంపై చీటింగ్ కేసు నమోదు చేసి, పాఠశాల గుర్తిం పును వెంటనే రద్దు చేయాలన్నారు. పలుకుబడితో అక్రమ మార్గాల్లో, నకిలీ పత్రాలతో ఉద్యోగాలు పొందిన వారిని, వారికీ సహకరించిన పాఠశాల యాజమాన్యాలను, సంబంధిత అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆదివాసీ విద్యార్థి సం ఘం జిల్లా ఇన్ చార్జి మంగం దీపక్ కుమార్, కన్వీనర్లు తుకారం ఉన్నారు.

### పోలింగ్ కేంద్రాలను

# తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

మండలంలోని జిల్లా పరిషత్ పాఠ శాలల్లో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని శుక్రవారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండ లంలోని జిల్లా పరిషత్ పాఠశాల పోలింగ్ కేంద్రాను విధిగా ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సమస్యలు పరిష్కరించాలని రెవిన్యూ అధికారులకు ఆదేశించారు. పోలింగ్ కేంద్రంలో కనీస వసతులు కల్పించాలని, విధిగా పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలన్నారు. పాఠశాలలోని వంట గదిని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల విద్యాధికారి జయరాజును ఆదేశించారు.

# బెల్లం పట్టిక పట్టివేత

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

చింతలమానేపల్లి మండలంలోని లంబాడిహెట్టి గ్రామంలోని గుడుంబా తయారీదారులకి బెల్లము, పటిక రవాణా చేస్తున్నట్లు ముందస్తు సమాచారం రావడంతో వాహనాన్ని తనిఖీ చేసి 630 కిలోల బెల్లమును, 10 కిలోల పటికనీ, 20 లీటర్ల గుడుంబా ను శు క్రవారం పట్టుకున్నట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు.

# ఆధ్యాత్మిక భావాలు కలిగిన నాయకుడు కేసీఆర్

### మాజీ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ఆధ్యాత్మిక భావలు కలిగిన వ్యక్తి కేసీఆర్ సీఎం అయ్యారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని వార్డు నంబర్ 12 శ్రీనగర్ కాలనీలో నిర్మించనున్న శ్రీ రాధకృష్ణ ఆలయానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జోగు రామన్నను కాలనీ వాసులు సత్కరించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ సనాతన ధర్మం, ఆచార పద్ధతులను భవితరాలకు అందించాలని సూచించారు. రాష్ట్రం కోసం ముఖ్యమంత్రులు చేయని కేసీఆర్ విధంగా యాగాలు, యజ్ఞాలు చేసి రాష్ట్రాన్ని సాధించడమేగాక దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలిపారని జోగురామన్న పేర్కొన్నారు. మనం కూడా హైందవ ధర్మాన్ని పరిరక్షిస్తునే భావితరాలకు మన ఆచారాలు, సంస్కృతి, పద్ధతులను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పవన్ నాయక్, విజ్జగిరి నారాయణ, ఖలీం, లక్ష్మణ్, సంతోష్, విజయ్, శ్రీకాంత్, మధుకర్, నవీన్, సతీష్, కిరణ్, విజయ, వీణ, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా రమాబాయి జయంతి వేడుకలు

**ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
రమాబాయి అంబేదర్‌ను మహిళలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తం అన్నారు. ఇంద్రవెల్లి మండలంలోని మిలింద్ నగర్ త్రిరత్న బుద్ధ విహార్‌లో మహామాయా ఉపాసిక సంఘం ఆధ్వర్యంలో మాతా రమాబాయి అంబేద్కర్ 127వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొని బుద్ధుడి విగ్రహానికి పూలమాలతో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి కామ్ రాజ్ వాగ్మారే, బౌద్ధ ఉపాసకులు ఉత్తమ్ కాంబ్లే, లాహుదాస్ సావంత్, మస్కే రాజ్ వర్ధన్, భీం ఆర్మీ మండల అధ్యక్షులు ఉత్తం సుర్యవంశీ, భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు సందీప్, జితేందర్, శివాజీ, దిలిప్, మాజీ ఎంపీటీసీ ఆశాబాయి, మహామాయా ఉపాసిక సంఘం అధ్యక్షురాలు మాయాబాయి, శిలాబాయి, ప్రభాబాయి, లతాబాయి, మాయావతి, దూర్పతాబాయి, ఉజ్వలబాయ్, ఉషాబాయి, మధుమాల, సంఘామిత్రబాయి, పంచేశిలా, దీపిక ఛాయబాయి, స్వర్ణ, ఇంద్రబాయి పాల్గొన్నారు.





## నేడు ధ్యాన హనుమాను ప్రాణప్రతిష్ట

**దిలావర్‌పూర్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
మండలంలోని కాల్వ పరిసర ప్రాంతంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగ ణం కోనేటి వద్ద ధ్యాన హనుమాన్ విగ్రహ ప్రతి ష్టాప మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం మహా గణపతి పూజ, యజ్ఞ హెూమాది కార్యక్రమాలు నిర్వహించారు. ధ్యాన హనుమాన్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ధ్యాన హనుమాన్ విగ్రహం ఎదుట సీతా రాముల కల్యాణం నిర్వహించారు. శనివారం విగ్రహ ప్రాణప్రతిష్ట నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. ధ్యాన సముదాయంలో ధ్యానం చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్న విగ్రహ, ధ్యాన సముదాయ దాత చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. విగ్రహ ప్రాణ ప్రతిష్టాపన అనంతరం అన్న ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

## బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**మామడ, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని రీజనల్ మేనేజర్ రామారావు తెలిపారు. మండలంలోని దిమ్మ దుర్తిలో నిర్వహించిన ఎఫ్ఎల్సీ సమావేశంలో మాట్లాడారు. తమశాఖలో పొదుపు పథకాలు, గృహ లోన్, రైతునేస్తం, వాహన రుణాలు తది తర సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ వ్యాపారులు, రైతుల ఖాతాలు తెరిచి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మామడ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, సీనియర్ అధికారి విలాస్, గంగాధర్ పాల్గొన్నారు.

## వుషూ కోచ్లకు సర్టిఫికెట్లు

**నిర్మల్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
ఇటీవల పంజాబ్ రాష్ట్రంలో నేతాజీ సుభాష్ నేషనల్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు వుషూ కోచ్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమం 45 రోజులు జరిగింది. ఇందులో జాతీయ స్థాయిలో 61మంది ఎంపిక కాగా.. నిర్మల్ జిల్లా నుంచి నలుగురు ఎంపికయ్యారు. సాయి, రాజశ్రీ, ప్రతిక్ష, సాయి కిరణ్ సర్టిఫికెట్ పొందారు. జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్ రెడ్డి వారిని శుక్రవారం అభినందించారు. జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించేలా తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా మార్షల్ ఆర్ట్స్ అధ్యక్షుడు తేజేందర్ సింగ్, శ్రీకాంత్, అమ్ముల భూషణ్ పాల్గొన్నారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు
### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
శాసనమండలి ఎన్నికల దృష్ట్యా అధికారులు ఎన్నికల పనులలో నిమగ్నమై ఉంటున్నందున ప్రతి సోమవారం నిర్వహించు ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. శాసనమండలి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున కోడ్ ముగిసేంత వరకు ప్రజావాణి కార్యక్రమం నిలిపివేయడం జరుగుతుందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## ఉద్యానవన పంటలు మేలు



**దిలావర్‌పూర్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
రైతులు సంప్రదాయ పంటలతోపాటు ఉద్యానవన పంటలు సాగు చేయాలని, తద్వారా దీర్ఘకాలిక ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి వెంకటరమణ తెలిపారు. మండలంలోని సముందర్పల్లి గ్రామంలో రైతులు సాగు చేస్తున్న మామిడి, ఆయిల్పామ్ తోటలను శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆ యన మాట్లాడుతూ మామిడి, ఆయిల్ఫామ్ తోటల్లో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను సూచించారు. ప్రస్తుత తరుణంలో మామిడి, ఆయిల్ఫామ్ చెట్లకు సమృద్ధిగా నీటిని అందించాలన్నారు. రైతులకు ఎలాంటి సమాచారం కావాలన్నా తమను సంప్రదించాలని తెలిపారు. ఇందులో స్థానిక అధికారి మౌనిక, ఆయిల్ఫామ్ క్లస్టర్ అధికారులు శేఖర్, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

## కారును ఢీకొన్న లారీ.. ఒకరికి తీవ్రగాయాలు

**ముథోల్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
పట్టణంలోని నిర్మల్ చౌరస్తాలో బైంసా-నిర్మల్ జాతీయ రహదారిపై శుక్రవారం కారును లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణానికి చెందిన గుజ్జుల్వార్ శంకర్ కారులో నిర్మల్ నుంచి వస్తూ నిర్మల్ చౌరస్తా వద్ద యూటర్న్ తీసుకుంటుండగా, బాసర నుంచి నిర్మల్కు వెళ్తున్న లారీ వేగంగా ఢీకొట్టి కొద్దిదూరం వరకు రాసుకెళ్లింది. దీంతో కారులోని శంకర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ పరారయ్యాడు.



# బాసరకు పోటెత్తిన భక్తులు



**ముథోల్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
మాఘ మాసం దశమి, రోహిణి నక్షత్రంతోపాటు శుక్రవారం శుభదినం కావడంతో నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి దేవి దర్శనానికి భక్తుల భారీగా తరలివచ్చారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తారు. వేకువ జామున అమ్మవారికి అర్చకులు అభిషేకం, అర్చన, విశేష పూజలను నిర్వహించారు. గోదావరిలో పుణ్య స్నానాలు చేసిన భక్తులు.. అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. పూజల అనంతరం ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో తల్లిదండ్రులు తమ చిన్నారులతో అక్షర శ్రీకర పూజలు, కుంకుమ పూజలు చేయించారు. అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టిందని అధికారులు తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

**రూ.12.27 లక్షల ఆదాయం..**
బాసర ఆలయానికి శుక్రవారం రూ. 12,27,275 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. రూ. 1000 అక్షరాభ్యాసాలు 687 జరుగగా రూ.6,87,000లు, రూ. 1550 అక్షరాభ్యాసాలు 300 జరుగగా, రూ.45,000, రూ.100 మండప ప్రవేశం 1,200 నిర్వహించగా, రూ.1,20,000లు, రూ.50 మండల ప్రవేశాలు 108 నిర్వహించగా రూ.5,400, రూ.100 అభిషేకం లడ్డూ ప్రసాదం 1,823 విక్రయించగా, రూ.1,82,300, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా 1,87,57 యం వచ్చినట్లు వివరించారు.

### ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయ
## పార్టీలు సహకరించాలి
### కలెక్టర్ వెంకటేష్ దోత్రే

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**
ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా రాజకీయ పార్టీలు సహక రించాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వెంకటేష్ దోత్రే కోరారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ఎన్నికల నిర్వహణకు జిల్లాలో 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాయని. 6137 పట్టభద్రులు, 470 ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించు కోనున్నట్లు, ఎన్నికల నియమావళిని పకడ్బందీ గా చేపడుతున్నామన్నారు. రాజకీయ పార్టీలకు పోలింగ్ కేంద్రాల జాబితా. ఓటర్ల జాబితాలను అందజేస్తామని చెప్పారు. ఈనెల 27న ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, ఇప్పటికే అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

**విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు..**
విధుల నిర్వహణ పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే హెచ్చరించారు. శుక్రవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా సంబంధిత అధికారులు తాగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ ప్రవీణ్ తదితరులున్నారు.

## రైలు కిందపడి మహిళ మృతి

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం గంగారం నగర్ సమీపంలో రైల్వే ట్రాక్ దగ్గర ఓ మహిళ మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. శుక్రవారం (35) సంవత్సరాల వయసు మహిళ మృతదేహం రైలు పట్టాలపై లభించింది. సమాచారం మేరకు జీఆర్‌బీపీ ఎస్సీ మహేందర్, హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ ఘటన స్థలాన్ని సందర్శించారు. 7 గంటల ప్రాంతంలోసదరు మహిళ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుందని పోలీసులు నిర్ధారించారు. మృతురాలిని పట్టణంలోని హనుమాన్ బస్తీకి చెందిన రాళ్ల బండి భాగ్యవతి గా గుర్తించారు. ఆమె కుటుంబ సభ్యులు సైతం మృతదేహాన్ని గుర్తించారు. మతిస్థిమితం కోల్పోయి ఆమె ఆత్మహత్య చేసుకుందని రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. రైల్వే ఎస్సై మహేందర్ ఉత్తర్వులు మేరకు కేసు నమోదు చేసుకొనీ రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల వేడీ



- జోరుగా టీచర్ నియోజకవర్గ అభ్యర్థుల ప్రచారం
- తమ సంఘ నేతలను గెలిపించుకునే ప్రయత్నం
- ఎన్నికల వేళ దావత్ షురూ..!
- ఉపాధ్యాయులకు ప్రలోభాలు మొదలు
- జిల్లా సంఘాల బాధ్యులకు అప్పగింత
- ఒక్కరోజే భారీగా నామినేషన్‌లు
- గ్రాడ్యుయేట్స్ 28, టీచర్స్‌కు 2, మొత్తం 30
- నేడు, రేపు సెలవు దినాలు ■ మిగిలింది ఒక్కరోజే



**(ప్రభాత సమాచారం, ఆదిలాబాద్ ప్రతినిధి)**

ప్రధాన ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థులు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించడంతో ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కరీంనగర్ జిల్లాల టీచర్ కాన్స్టెన్సీ అభ్యర్థుల తరపున జిల్లాల్లో ప్రచారం ముమ్మరం చేశారు. ఉపాధ్యాయ సంఘ నేతలు ఉపాధ్యాయులతో మీటింగ్‌లు ఏర్పాటు చేసి పెద్ద మొత్తంలో మందు, మాంసంతో విందు దావత్‌లు ఇస్తూ ఉపాధ్యాయులకు ప్రలోభాల ఎర వేస్తున్నట్టు చర్చ నడుస్తోంది. ఆయా జిల్లాల బాధ్యులు మండలాల వారీగా, పట్టణాల వారీగా జిల్లా సంఘాల బాధ్యులు వెళ్లి తమ సంఘాల ఉపాధ్యాయ సభ్యులతో సమావేశాలు పెడుతున్నారు. అదే రోజు ఎక్కడికి అక్కడ పెద్ద మొత్తంలో మందు, మాంసంతో విందు పార్టీలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఒక సంఘం నుంచి మరో సంఘం లోకి మారే ఉపాధ్యాయులకు ప్రలోభాల ఎర వేస్తున్నారు. భవిష్యత్తులో మండల అధ్యక్ష పదవి లేదంటే జిల్లా స్థాయిలో పదవి ఇస్తామంటూ కొంతమంది బలం ఉన్న ఉపాధ్యాయ నేతలకు హామీ ఇస్తున్నారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ సంఘ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని బలం ఉన్న ఉపాధ్యాయ సంఘాల నేతలకుఎర వేస్తున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈసారి నలుగురు అభ్యర్థులు బలమైన పోటీ ఉండే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. కీలక ఉపాధ్యాయ సంఘం పీఆర్‌టీయూ టీఎస్ తరపున వంగ మహేందర్ రెడ్డి బరిలో ఉన్నారు. గతంలో ఇదే సంఘం నుంచి ఎమ్మెల్సీగా గెలుపొంది ఈసారి ఆ సంఘం తరఫున టికెట్ దక్కక పోవడంతో పీఆర్టీయూ తెలంగాణ, ఎస్టీయూ, టీయూటీఎఫ్ కూటమి అభ్యర్థిగా రఘోత్తంరెడ్డి మళ్లీ పోటీ చేస్తున్నారు. ఇది ఎన్నికల్లో అత్యంత ఆసక్తికరంగా మారుతున్నది. మరో వైపు భారతీయ జనతా పార్టీ ప్రైవేటు విద్యాసంస్థల అధినేత మల్క కొమురయ్యకు మాండేట్ ఇచ్చింది. ఒక రాజకీయ పార్టీ తరపున ఈయన ఒక్కరు మాత్రమే బరిలో ఉండడం విశేషం. హిందుత్వ భావజాలం ఉన్న ఉపాధ్యాయ సంఘం తపస్ కొమురయ్యకు పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తున్నది. మరోవైపు టీఎస్ యూటీఎఫ్, టీపీఎఫ్ ఉమ్మడిగా వై అశోక్ కుమార్‌ను బరిలో ఉంచారు. ఇదిలా ఉంటే సుదీర్ఘకాలంగా తమను ఓల్డ్‌పెన్షన్‌లోకి మార్చాలని డిమాండ్ చేస్తున్న సీపీఎస్ ఉద్యోగ సంఘాల తరపున తిరుమల్ రెడ్డి ఇన్నారెడ్డి అనే అభ్యర్థిని పోటీకి తెలిపారు. సీపీఎస్ ఉపాధ్యాయుల సైతం భారీ మొత్తంలోనే ఉన్న నేపథ్యంలో పోటీ ఆస క్తికరంగా మారుతున్నది. పెద్ద మొత్తంలో మందు, విందులతో సాగుతున్న ఉపాధ్యాయ సంఘాల ఎమ్మెల్సీ ప్రచారం ఎవరి వైపు మొగ్గు చూపుతుందో ఆసక్తికరంగా మారింది.

**ఒక్కరోజే భారీగా నామినేషన్‌లు...**

ఉమ్మడి కరీంనగర్- మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు పోటెత్తాయి. శుక్రవారం మంచిరోజు కావడంతో ఆయాస్థానాలకు పోటీ చేస్తున్న ఆశావహులు అనుచరగణంతో భారీర్యాలీగా వచ్చి నామినేషన్లు వేశారు. గ్రాడ్యుయేట్స్ స్థానానికి 28 మంది, టీచర్స్ స్థానానికి రెండు మొత్తం 30 నామపత్రాలు వేశారు. ఈనెల 3వ తేదీన నామినేషన్ల పర్వం మొదలైనప్పటికీ.. శుక్రవారం దాఖలైన నామపత్రాలు అత్యధి కం కావడం గమనార్హం. ఉదయం ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి నామినేషన్ వేశారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డితో నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ మేయర్ రవీందర్ సింగ్, ప్రసన్న హరికృష్ణ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. వీరిలో రవీందర్ సింగ్ సన్నిహితులతో రాగా, హరికృష్ణ అనుచరులు, కళాకారులతో భారీ ర్యాలీగా వచ్చారు. వీరితోపా టు సామాజిక ఉద్యమకారులు బక్క జడ్సన్, సిలివేరు శ్రీకాంత్, మాజీ డీఎస్పీ మదనం గంగాధర్, లక్ష్య స్కూల్స్ అధినేత ముస్తాక్‌అలీ నామినేషన్ పత్రాలను అందజేశారు.

**నేడు, రేపు సెలవు...**

శనివారం, ఆదివారం సెలవుదినం కావడంతో నా మినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఉండదు. ఇక మిగిలింది 10వ తేదీ మాత్రమే. సోమవారం చివరి రోజు కూడా భారీగా నామినేషన్లు దాఖలు అయ్యే అవకా శముంది. ఇంతవరకూ వేయని వారితోపాటు రెండోసారి వేసేవారికి అదే చివరి అవకాశం. సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మెదక్ జిల్లా మంత్రి దామోదర రాజనరసింహాలతో కలిసి భారీ ఊరేగింపుగా వచ్చి మరోసారి నామినేషన్ దాఖలు చేయనున్నారు. రవీందర్ సింగ్ కూడా రెండోసెట్ దాఖలుకు ర్యాలీ తీయనున్నారు. న్యాయవాది మెతుకు హేమలత పటేల్ గ్రాడ్యుయేట్ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటి వరకూ దాఖలైన నామినేషన్లలో హేమలత ఏకైక మహిళ కావడం విశేషం.

## దాడిచేసినందుకు ఒకరి రిమాండ్

**ముథోల్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

మండలంలోని సింగన్గాం గ్రామానికి చెందిన దాసర్వాడ్ గణేష్ తల్లిని రాయితో గాయపర్చినందుకు శుక్రవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. సింగర్గాం గ్రామానికి చెందిన దాసరవాడ్ గణేశ్ అయన భార్య భాగ్యశ్రీ మధ్య గురువారం గొడవ జరిగింది. గొడవ ఆపేందుకు తల్లి కోండ్యామబాయి వెళ్లింది. గణేశ్ రాయితో భార్య బాగ్యశ్రీకి కొడుతుండగా అడ్డుకోబోయిన కోండ్యాబాయికి తలకు తగలడంతో తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు ఆమెను గాంధీ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం గణేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామని ఎస్సై రమేశ్ తెలిపారు.

## వింతవ్యాధితోనే కుక్కల మృతి

**తాండూర్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

తాండూర్ మేజర్ గ్రామ పంచాయతీలో వింత వ్యాధి సోకిన వీధి కుక్కలే మృతి చెందాయని కాం గ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, మాజీ ఎంపిపి సిరంగి శంకర్ అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు పలుమార్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంపీడీవో గ్రామ పంచాయతీలో వీధి కుక్కల నిర్మూలనకు మత్తు మందు ఇచ్చి అడవికి తరలించే క్రమంలో మత్తు మందు వికటించి మృతి చెందాయని తెలిపారు. మత్తు మందు ఇచ్చి వీధి కుక్కలను చంపి వేశారన్న ఆరోపణల్లో నిజం లేదన్నారు.

## విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ

**తలమడుగు, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

సామజిక సేవే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని బ్లూ భీమ్ యూత్ అధ్యక్షులు ప్రేమేందర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రం లో గల జడ్పీ హెచ్‌స్ పాఠశాలలో గల విద్యార్థులకు యూత్ సభ్యుడు మామిడి అశోక్ జన్మదిన సందర్భంగా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకట్రావ్ మాట్లాడుతూ సామజిక సేవలో భీమ్ యూత్ ఎల్లప్పుడూ ముందు ఉంటుందని మునుముందు సేవలు కొనసాగించాలి అభినందించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కార బాధ్యత నాదే

### బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్



**నేరడిగొండ, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత తనదేనని ఆదిలాబాద్ జిల్లా బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుత్పాల, యాపాలగూడ, లక్ష్మీపూర్ గ్రామాల ప్రజలు నేరడిగొండలోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు . దీంతో గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 10న పీఎం నేషనల్ అప్రెంటిషిప్ మేళ

**జన్నారం, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఐటీ కళాశాలలో పీఎం నేషనల్ అప్రెంటిషిప్ మేళాను నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బండి రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 10న తమ కళాశాలలో అప్రెంటిషిప్ మేళ ఉంటుందన్నారు. ఆసక్తిగల ఐటీఐ కంప్లీట్ చేసిన అభ్యర్థులు బయోడేటా ఫామ్, ఒరిజినల్ సర్టిఫికెట్స్ హాజరు కావాలని ఆయన సూచి. పెన్నార్ ఎలక్ట్రికల్స్, రానే ఇంజన్ వాల్స్, తదితర కంపెనీలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

**గుడిహత్నూర్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

గుడిహత్నూర్ మండలంలోని సీతాగొంది గ్రామం వద్ద శుక్రవారం జాతీయ రహదారి 44 పై ఘోర ప్రమాదం సంభవించి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ పట్టణంలోని న్యూ కుమ్మరి వాడకు చెందిన జిల్లడి దత్తు (25) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ వైపు వెళ్తున్న క్రమంలో సీతాగొంది గ్రామం వద్ద ద్విచక్ర వాహనాన్ని వెనుక నుండి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో దత్తు అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరు గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణకు కృషి చేయడం అభినందనీయమని మాదిగ సంఘం నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యే బొజ్జు పటేల్, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ ప్రీతంల చిత్రపటాలకు వారు పాలాభిషేకం చేశారు. 30 సంవత్సరాల కళ కాంగ్రెస్ పార్టీ వల్ల సాధ్యమైందన్నారు.

## పూలాజీబాబా ధ్యానకేంద్రం వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం



**ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం హర్కాపూర్ ఆంధ్‌గూడ గ్రామంలోని పూలాజీబాబా ధ్యానకేంద్రం వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తం ముఖ్య అతిథిగా పాల్గొని పూలాజీబాబా ధ్యానకేంద్రం జెండాకు పూజలు నిర్వహించి వార్షికోత్సవ వేడుకలు ప్రారంభించారు. ఈ వార్షికోత్సవ వేడుకలు రెండు రోజులుగా కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కుడే కైలాస్, గ్రామస్థులు శ్రీరాం, భరత్, ఆత్మారాం తదితరులు పాల్గొన్నారు.

## వరకట్నం వేధింపులో ముగ్గురిపై కేసు నమోదు

**ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

అదనపు వరకట్నం కావాలని భార్యను వేధిస్తున్న భర్తతోపాటు ఆమె అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు కుమ్రంభీం-అసిఫాబాద్ జిల్లా ఇంద్రవెల్లి ఎస్ఐ దుబ్బక సునీల్ తెలిపారు శుక్రవారం రాత్రి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఇంద్రవెల్లి మండలం ఏమాయికుంట గ్రామవాసి అనితకు ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం ఇష్‌పూర్ గ్రామ వాసి తగిరే రాయిసింగ్తో 2023లో వివాహమైందని తెలిపారు. మూడు నెలలుగా భర్త రాయిసింగ్తో పాటు అత్తమామలు తగిరే పంచిబాయి, తగిరే హర్ సింగ్లు ఆమెను అదనపు వరకట్నం కోసం వేధిస్తున్నారని తెలిపారు. తగిరే అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుబ్బక సునీల్ తెలిపారు.


# అందాలతో వేడెక్కిస్తున్న మాళవిక శర్మ



మాళవిక శర్మ అంటే తెలియని సినీ అభిమాని ఉండరు. చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ, తన గ్లామర్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది ఈ అమ్మడు. మాళవిక శర్మ 1999 జనవరి 26న ముంబైలో జన్మించింది. ఆమె న్యాయవాది కూడా. ఆమె రిజ్వీ లా కాలేజీ నుండి క్రిమినాలజీలో స్పెషలైజేషన్‌తో బ్యాచిలర్ ఆఫ్ లాస్ డిగ్రీని పొందింది. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన మాళవిక శర్మ, ఆ తర్వాత సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. మాళవిక శర్మ ప్రధానంగా తెలుగు, తమిళ సినిమాల్లో నటించింది. ఆమె 2018 లో రవితేజతో కలిసి ''నేల టిక్కెట్'' చిత్రంలో నటించడం ద్వారా తెలుగు తెరకు పరిచయం అయ్యింది. ఆమె ''రెడ్'' ,''కాఫీ విత్ కాదల్'' ,'హరోం హర , భీమా వంటి చిత్రాలలో నటించింది.అయితే ఈ సినిమాలు బాక్సాఫీస్ పెద్దగా విజయాన్ని నమోదు చేయలేకపోయాయి. దీంతో మాళవిక శర్మ కెరీర్ అనుకున్నంతస్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. మాళవిక శర్మ చేతిలో పెద్దగా సినిమాలు లేకపోయినప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం చురుకుగా ఉంటుంది.మాళవిక శర్మ ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా తన అభిమానులతో టచ్‌లో ఉంటుంది. ఇదే సమయంలో తన వ్యక్తిగత విషయాలతో పాటు, తన సినిమా విషయాలను సైతం అభిమానులతో సోషల్ మీడియా ద్వారా పంచుకుంటుంది. తన లేటెస్ట్ ఫొటోలను సైతం అభిమానులకు షేర్ చేస్తుంటుంది. తాజాగా మాళవిక శర్మ తన లేటెస్ట్ ఫొటోషూట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసింది.మరోసారి తనదైన హాట్‌నెస్ అభిమానులకు కిక్ ఇచ్చింది. బ్లూ కలర్ బొట్ ఫిట్‌లో కనిపించి అదరగొట్టింది. లోపల్ బ్రా లేకుండా షట్ ఓపెన్ చేసి మరి తన అందాలను చూపించింది. ఈ ఫొటోలపై నెటిజన్లు పలు రకాలుగా స్పందిస్తున్నారు. పర్ఫెక్ట్ ఫిగర్ అని కొందరు కామెంట్స్ చేస్తుంటే, అన్ని మాకే చూపిస్తే రేపు పెళ్లి అయిన తర్వాత నీ భర్తకు ఏం చూపిస్తావు అంటూ మరి కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం మాళవిక శర్మ బ్రాలెస్ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.



# పెళ్లి చేసుకోవద్దు



ఇప్పుడే సినిమాకు విన్నా.. సంగీత దర్శకుడు తమన్ పేరే వినబడుతోంది. మ్యాగ్జిమమ్ స్టార్ హీరోలందరి చిత్రాలకు తమన్ వాయిస్తున్నాడు. అంత బిజీగా ఉన్నా కూడా ఎప్పుడూ వర్క్ టెన్షన్‌ని తన ఫేస్‌లో కనబడనివ్వకుండా.. నవ్వుతూ ఉండే తమన్ తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో లైఫ్ స్టైల్, స్ట్రెస్ గురించి మాట్లాడాడు. అలాగే నేటి తరం గురించి మాట్లాడుతూ.. సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. తమన్ మాట్లాడుతూ.. 'ఇప్పుడు అమ్మాయిలు ఇండిపెండెట్ అయ్యారు.. ఒకరి మీద వాళ్లు బతకాలని అనుకోవడం లేదు.. సోషల్ మీడియా ప్రభావం ఎక్కువైంది.. ఇన్‌స్టాగ్రాం వాడకం ఎక్కువైంది.. జనాల మైండ్ సెట్ మారింది.. కలిసి ఉండే ఆలోచనాధోరణి మారిపోయింది.. పెళ్లి చేసుకున్నా కూడా వెంటనే విడిపోతోన్నారు.. అందుకే నేను ఈ పెళ్లిళ్లు ఇప్పుడు వేస్ట్ అంటున్నాను.. నన్ను ఎవరైనా సలహా అడిగితే మాత్రం పెళ్లి వద్దు అనే అంటాను' అని చెప్పుకొచ్చాడు.మరోవైపు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధి క్యాంపులకు తల సేమియా వ్యాధి గ్రస్తుల చికిత్స కోసం తమన్ ఫండ్ రైజింగ్ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ''లైఫ్ లో దేన్నైనా నిలబెట్టవచ్చు. ట్రస్ట్ ను నిలబెట్టడం చాలా కష్టం. ఎన్టీఆర్ గారు చంద్రబాబు గారు ఎంతోమందికి స్ఫూర్తివంతులు. వారు స్థాపించిన ట్రస్ట్ కార్యక్రమంలో నేను పార్టిసిపేట్ చేయడం గర్వంగా ఉంది. చంద్రబాబు నాయుడు గారి చేసిన అభివృద్ధి ఏంటో మనం చూశాం. ఫిబ్రవరి 15న విజయవాడ లో జరిగే ఈవెంట్ లో ఎన్టీఆర్ గారి ఉత్తమ పాటలు ఉంటాయి. మా టీమ్ మెంబర్స్ ప్రిపేర్ అవుతున్నాం'' అని తమన్ అన్నారు.



# లవ్‌యాపా అంటూ వస్తోన్న ఖుషీ కపూర్

'లవ్‌యాపా' అంటూ యూత్‌ఫుల్ లవ్‌స్టోరీతో పలకరించనున్నారు ఖుషీ కపూర్. ఆమె ప్రధానపాత్రలో నటించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రబృందానికి విషెస్ చెప్పిన జాన్వీకపూర్ తన చెల్లి ఖుషీని చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. 'ఎంత కష్టమైనప్పటికీ నీకు నచ్చిన దాన్ని చాలా నిజాయితీగా, శ్రద్ధగా చేస్తున్నందుకు నిన్ను చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది ఖుషీ. వినోదం, హాస్యంతో పాటు ఎమోషనల్ సన్నివేశాలతో కూడిన ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం 7 నుంచి అన్ని థియేటర్‌లలో సందడి చేస్తుంది. నేను ఈ సినిమా చూసి కచ్చితంగా భావోద్వేగానికి గురవుతాను. 'లవ్‌యాపా' స్పెషల్ టీ షర్ట్ వేసుకున్న జాన్వీ.. తన సినిమాల విడుదల తేదీలలో ఖుషీని కూడా తన ఫొటో ఉన్న టీ షర్ట్ ధరించాలని కోరారు. 2023లో 'ది ఆర్చిస్'తో హీరోయిన్‌గా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు ఖుషీ కపూర్ . ఆ చిత్రంతో ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు 'లవ్‌యాపా' అంటూ పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పుడిదే చిత్రానికి రీమేక్‌గా 'లవ్‌యాపా' సిద్ధమైంది. అద్వైత్ చందన్ దర్శకత్వం వహించారు. ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా వ్యవహరించారు.

# సామ్.. చాలా దురదుష్టవంతురాలు



యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య ప్రస్తుతం గీత ఆర్ట్స్ బ్యానరులో అల్లు అరవింద్ భారీ బడ్జెట్ తో నిర్మించిన తండేల్ సినిమా థియేటర్లలో విడుదలై మంచి టాక్ తెచ్చుకుంది. తాజాగా ఈ సినిమా గురించి అక్కినేని కొత్త కోడలు శోభిత ధూళిపాళ సామాజిక మాధ్యమంలో పోస్ట్ పెట్టింది. ఈ సినిమా కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని, థియేటర్లలో ఈ సినిమా కచ్చితంగా చూస్తానని చెప్పింది. కొత్త కోడలుగా అక్కినేని కుటుంబంలో మంచిపేరు తెచ్చుకుంది. వివాహమైన తర్వాత ఇటీవలే తొలిసారిగా ఈ జంట బయట దర్శనమిచ్చింది. నాగచైతన్య–శోభిత చాలా సంతోషంగా ఉన్నారని దీన్నిబట్టి అర్థమవుతోందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అక్కినేని లాంటి పెద్ద కుటుబంలోకి కోడలిగా అవకాశం వస్తే సమంత చాలా దురదృష్టవంతురాలై దాన్ని పోగొట్టుకుందంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ఏదేశమైనప్పటికీ శోభిత ధూళిపాళ చాలా అదృష్టవంతురాలంటున్నారు.

# 'నో' చెబితే టచ్ చేసే సాహసం చేయరు



హీరోయిన్లకు ఎక్స్‌పోజింగ్ అవసరమా? అంటే, అవసరమే అంటోంది చాందిని తమిళరసన్. జెనీలియా పోలికలతో ఉన్న ఈ బ్యూటీ ప్రస్తుతం కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. చెన్నైలో పుట్టి పెరిగిన ఈ యువ నటి.. ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీలో ఉన్న పరిస్థితులపై సూటిగా చెప్పుకొచ్చింది. "సినిమా పరిశ్రమ సురక్షితమైంది. ఇక్కడ మనల్నికాదని ఏదీ జరగదు. 'నో' చెబితే ఎవరూ టచ్ చేసేందుకు సాహసించరు. నో మీన్స్ నో.. వద్దు అంటే ఇక్కడ వద్దనే" అని చిత్ర పరిశ్రమలోని క్యాస్టింగ్ కౌచ్‌పై యువ హీరోయిన్ చాందిని తమిళరసన్ కుండబద్ధలు కొట్టారు. 'సిద్ధు ప్లస్–2'తో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఈ భామ.. 'నాన్ రాజావాగ పోగిరేన్', 'విల్ అంబు', 'కట్టాప్పావై కాణోమ్', 'మన్నర్ వాగైయ్యా', 'కసడ తపర' వంటి అనేక చిత్రాల్లో నటించారు. తెలుగులో 'బుజ్జి ఇలా రా', 'రామ్ అసుర్' వంటి చిత్రాలలో నటించి.. తెలుగు ప్రేక్షకులకూ ఈ భామ పరిచయమైంది. చెన్నైలో పుట్టి పెరిగిన ఈ యువ నటి.. ప్రస్తుతం తమిళంతో పాటు టాలీవుడ్‌లోనూ బిజీగా ఉన్నారు. తాజాగా ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మనసువిప్పి మాట్లాడారు. సినిమా అనేది మహాసముద్రం. దీన్ని ఈదడం కష్టం. నా సినీ జర్నీ ఊహించనిది. నా ఫ్యామిలీకి సినీ నేపథ్యం లేదు. బాగా చదువుకుని మంచి ఉద్యోగానికి వెళ్లాలన్నదే కుటుంబ సభ్యుల కోరిక. ప్లస్ వన్ చదువుకునే సమయంలో 'మిస్ చెన్నై' పోటీల్లో పాల్గొని మూడో స్థానంలో నిలిచా. ఆ తర్వాత సినీ అవకాశాలు రావడం మొదలయ్యాయి. హీరోయిన్లకు అన్ని అంశాలతో పాటు అందాల ఆరబోత ముఖ్యం. స్టోరీ డిమాండ్ చేస్తే గ్లామర్‌గా నటించాల్సిందే.

# ఇక తెరపైకి మోక్షజ్ఞ

నందమూరి బాలకృష్ణ వరుసగా సినిమాలు చేస్తూనే మొన్నటివరకు అన్ స్టాపబుల్ షో చేశారు. దీంతోపాటు తన తనయుడు మోక్షజ్ఞను వెండితెరకు పరిచయం చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. పద్మభూషణ్ అవార్డు అందుకున్న తర్వాత రెట్టించిన ఉత్సాహంతో ఉన్న బాలయ్య తన కొడుకును స్టార్ హీరోగా తీర్చిదిద్దాలంటే తొలి సినిమాగా ఎటువంటి నిర్ణయం తీసుకోవాలనే యోచనలో ఉన్నారు. అయితే ఈ సినిమాకు సంబంధించిన అప్ డేట్ తాజాగా వచ్చింది. ప్రీ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తిచేసుకొని త్వరలోనే సెట్స్ పైకి అడుగుపెట్టబోతోంది. ప్రశాంత్ వర్మ ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని దర్శకత్వం వహించనున్నారని, బాలయ్య తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడాలనే ప్రయత్నాల్లో ఉన్నారని వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాకు నిర్మాత ఎవరు అనేది ఇంకా ఖరారు కాలేదు. ఆమె అయితే మోక్షజ్ఞ సరసన బాగుంటుందంటున్నారు మోక్షజ్ఞ సరసన హీరోయిన్ గా శ్రీలీల నటిస్తుందని గతంలో వార్తలు వచ్చాయి. అయితే శ్రీలీల వద్దని, మీనాక్షి చౌదరి అయితే బాగుంటుందంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. గోట్, లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలతో బ్లాక్ బస్టర్లను అందుకుందని, తను మోక్షజ్ఞ సరసన హీరోయిన్ అయితే వీరిద్దరి కాంబినేషన్ అదిరిపోతుందని అంటున్నారు. దీనికి సంబంధించిన ఓ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. చాలామంది అభిమానులు మాత్రం హీరోయిన్ గా మీనాక్షి చౌదరినే ఖరారు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సినిమా తర్వాత రెండో సినిమాను కూడా బాలయ్య సిద్ధం చేసివుంచారు.



# ప్రజలెవరు ఆందోళన చెందవద్దు..!



## చెక్ పోస్టుల వద్ద అటవీ శాఖ వేధింపులు ఉండవు

### నేటి నుంచి ఆంక్షలు ఎత్తివేత

### ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఉట్నూర్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని అటవీ శాఖ చెక్ పోస్టుల వద్ద రాత్రి తొమ్మిది గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు వాహనాల రాక పోకలను నిషేదిస్తూ విధించిన ఆంక్షలను శుక్రవారం ఎత్తి వేసిందని, ఇకపై చెక్ పోస్టుల వద్ద అటవీ శాఖ వేధింపులు ఉండవని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తెలిపారు. ప్రజలేవరు ఆందోళన చెంద వద్దని పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కంజర్వే టర్ రాకేశ్ డోబ్రియాల్‌ను కలిసి అటవీ శాఖ అధికారుల తీరుపై అస హనం వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ... వినతి పత్రాన్ని అందజేశారు. నేటి నుంచి చెకపోస్టుల వద్ద నుంచి ఒక్క ఫిర్యాదు రాకూడదని ఎమ్మెల్యే పిసిసిఎఫ్‌కు సూచించారు. చెక్ పోస్టుల వద్ద ప్రజలకు, వాహనదా రులకు ఎలాంటి వేధింపులు ఉండవని స్థానికులు తమ ఆధారాలు చూపి రాకపోకలు సాగించవచ్చని వారిని అడ్డుకోకుండా అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేస్తున్నట్లు పిసిసిఎఫ్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెడ్మబొజ్జు వెంట ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఉన్నారు.

# దేవతామూర్తుల కోసం ఆందోళన

### వదంతులతో ఇరు గ్రామల మధ్య గొడవ

### పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

**కడెం, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కడెం మండలం దిల్దార్‌నగర్, ఎలగడప, సారంగాపూర్ గ్రామాల సమీపంలోని పురాతన అక్కకొండ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 8 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులను సంప్రదాయం ప్రకారం మండలంలో ఎలగడప గ్రామం నుంచి ఊరేగింపుగా అక్కకొండ లక్ష్మీ నరసింహాస్వామి ఆలయానికి తీసుకొస్తారు. తెల్లవారితే ఊరేగించే ఉత్సవ మూర్తులు శుక్రవారం కనిపించలేదు. దీంతో సారంగాపూర్ గ్రామస్తులు ఎత్తుకెళ్లారని శుక్రవారం రాత్రి పుకార్లు వ్యాపించడంతో ఎలగడప గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడికి చేరుకున్నా ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి పరిస్థితిని సమీక్షించారు. ఉత్సవ మూర్తులను ఆల య పూజరులే తీసుకెళ్లారని గ్రామస్తులకు తెలుపడంతో అందోళన సద్దుమణిగింది.



# రాష్ట్ర పండుగగా కుమ్రం భీం వర్ధంతి

### - సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కుమ్రంభీం మనువడు సోనేరావు

### - కుమ్రంభీం మనువడు కుమ్రం సోనేరావును సన్మానించిన అసెంబ్లీ స్పీకర్

**ఉట్నూర్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

గోండు వీరుడు కుమ్రం భీం వర్ధంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని హర్షిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే కుమ్రం భీం మనువడు కుమ్రం సోనేరావుతో కలిసి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కృత్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు.కుమ్రం భీం పోరాటానికి అండగా నిలబడి పోరు సల్పిన జోడేఘాట్ పరిధిలోని 12 గ్రామాల ప్రజల సమస్యలు, పరిష్కరించాలని, రోడ్లు, ఇండ్లు మంజూరు చేయాలనీ ముఖ్య మంత్రిని కోరారు. అసెంబ్లీని మొదటిసారి సందర్శించిన కుమ్రం భీం మనుమడు సోనేరావును శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సన్మానించారు.






# క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో

# రాణించేలా ప్రోత్సాహం

### - కబడ్డీ సంఘం అంతర్జాతీయ డైరెక్టర్ జగదీష్ యాదవ్

### - కబడ్డీ చాంపియన్ సూర్యపేట - త్వరలో తెలుగు కబడ్డీ లీగ్

### - రెండో స్థానంలో నల్గొండ జట్టు - హోరాహోరీగా ఫైనల్ మ్యాచ్



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

క్రికెట్ తర్వాత కబడ్డీని ప్రజలు ఎక్కువగా ఆదరిస్తారని ఇందులో రాణించే క్రీడాకారులను గుర్తించి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహిస్తామని కబడ్డీ సంఘం అంతర్జాతీయ డైరెక్టర్ జగదీష్ యాదవ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శని మైదానంలో గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న సీనియర్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫైనల్ మ్యాచ్ సూర్యపేట, నల్గొండ మధ్య నిర్వహించగా, పోటీ హెూరాహెూరీగా సాగిన ఈ మ్యాచ్లో నల్గొండ కబడ్డీ జట్టు 36 పాయింట్లు చేయగా సూర్యపేట 39 పాయింట్లు సాధిం చి గెలిచిందనీ, కాగా ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమం. లో గెలుపొందిన జట్లకు బహుమతులను ముఖ్య అ తిథులు అందజేశారు. ఈ సందర్భంగా కబడ్డీ సంఘం అంతర్జాతీయ డైరెక్టర్ జగదీష్ యాదవ్ మాట్లాడుతూ ఒక సమయంలో క్రికెట్కు అత్యంత ఆదరణ ఉండేదని అన్నారు. నేను గ్రామీణ క్రీడాకారున్ని అయిన కబడ్డీ కి ఆ దరణ రావడం సంతోషకరమైన విషయమని తెలిపా రు. ఇటీవల జరిగిన ఏసియన్ లో కబడ్డీ జట్టు దేశానికి తొలి బంగారు పతకం అందించిందని సంతోషం వ్యక్తం చేశారు. అదేవిధంగా భారతదేశంలో 2036 లో జరిగే ఒలంపిక్స్ లో కూడా తొలి బంగారు పతకం కబడ్డీ జట్టు అందిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతమైన ఆదిలాబాద్ లాంటి జిల్లాలో రాష్ట్రస్థాయిలో పోటీల నిర్వహణ బ్రహ్మాండంగా నిర్వహించమన్నారు. ఈ పోటీలు నిర్వహణ వారిలోని పట్టుదల చూస్తుంటే జాతీయ పోటీలను కూడా అవలీల నిర్వహిస్తారని నమ్మ కం ఏర్పడిందన్నారు.




# లొంగిపోతే పునరావాసం కల్పిస్తాం

### మావోయిస్టు శ్రీనివాస్ తల్లిని పరామర్శించిన ఎస్పీ జానకీ షర్మిల

**ఖానాపూర్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

14 ఏండ్ల వయసులో బడికి పోతానని వెళ్లి 50 ఏండ్లు గడిసినయ్. నీకు తల్లి గుర్తుకు రావడం లేదా.. చావుకు దగ్గరైన. కొరివి పెట్టేందుకై నా రాబిడ్డా' అని అజ్ఞాతంలో ఉన్న మవోయిస్తు తూము శ్రీనివాస్ తల్లి లచ్చవ్వ ప్రాధేయపడింది. మండలంలోని బావాపూర్ (ఆర్) గ్రామంలోని లచ్చవ్వ కుమారుడు 50 ఏళ్ల క్రితం 14 ఏళ్ల వయస్సులో బోధన్లోని ప్రైవేట్ స్కూల్కు వెళ్తున్నానని వెళ్లి తిరిగి రాకుండా మావోయిస్టుగా అజ్ఞాత జీవితం గడుపుతున్నాడు అతని తల్లిని ఎస్పీ జానకీ షర్మిల శుక్రవారం కలిసింది. వనం వీడి జనంలోకి రావాలని ఎస్పీ సాక్షిగా లచ్చవ్వ కుమరుడిని ప్రాధేయపడింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోరు కన్నా.. ఊరు మిన్నా.. మన ఊరికి తరలి రండి.. కార్యక్రమంలో భాగంగా జన జీవనంలోకి వచ్చే మావోయిస్టులకు ప్రభుత్వం పునరావాస కల్పిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ తల్లి లచ్చవ్వకు దుస్తులతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు.

# నిర్లక్ష్యం చేస్తే చర్యలు

### ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

**చెన్నూర్, ఫిబ్రవరి 7 (ప్రభాత సమాచారం)**

రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించ డంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హెచ్చరించారు. మంచిర్యాల జిల్లాచెన్నూర్ పట్టణంలో డయేరియా వ్యాప్తి చెందడంతో పట్టణంలోని పలు వీధులలో డయేరియా సోకి చెన్నూర్ ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తాగునీరు కలుషితం చెందడంతో డయేరియా వ్యాప్తి చెంది చాలామంది బాధపడుతున్నరని విషయం స్థానిక నాయకుల ద్వారా తన దృష్టికి రావడంతో ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను తనిఖీ చేయడానికి వచ్చాను అని తెలిపారు. అమృత్ పథకం ద్వారా బతుకమ్మ వాగు నుండి కాకుండా గోదావరి నుండి పట్టణ ప్రజలకు త్రాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని అందుకుగాను కలెక్టర్‌తో మాట్లాడి నిధులు కేటాయించి సమస్య శాశ్వత పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకుంటాం అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.